## సాగు నీళ్ల కోసం రైతుల ధర్నా

- నీళ్లివ్వకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం
- బీఆర్ఎస్ పిలుపుతో హైవేపై ధర్నా
- కనికరం లేని సర్కారుపై కన్నెర్ర

దేవరుప్పుల, మార్చి 12: 'ఒక్క తడికి నీరిస్తే పంటలు పండేవి.. నోటికాడి బుక్క నేల పాలైంది.. కనికరం లేని సర్కారును మునుపెన్నడూ చూడలేదు' అంటూ జనగామ జిల్లా దేవరుప్పులలో రైతులు రోడ్డెక్కారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. పదేండ్లుగా నీటి కరువును చూడలేదని, జలాశయాల్లో నీరు ఉన్నా ఇవ్వలేని దద్దమ్మ సర్కారు అంటూ మండిపడ్డారు. చెరువులు నింపాలని, ఎండిన పంటలకు ఎకరాకు 20 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు తాత్కాలిక ఉపశమనాలతో కాలం గడుపుతోందని విమర్శించారు.

### సాగునీళ్లు ఇవ్వకపోతే ముట్టడి

కరీంనగర్ రూరల్, మార్చి 12 : పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వడం లేదని రైతులు రోడ్డెక్కుతున్నారు. మంగళవారం కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన రైతులు గ్రామంలోని ఎస్సారెస్పీ డీ-87 కెనాల్ సమీపంలో రోడ్డు వద్ద ధర్నా చేశారు. ఎస్సారెస్పీ డీ 87 ద్వారా చామనపల్లిలోని రాజసముద్రం చెరువులోకి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నీరందకపోతే దాదాపు వెయ్యి ఎకరాల పంట నష్టపోతామని రైతులు వాపోయారు. కాలువల్లో నీళ్లు వదలకపోతే కరీంనగర్ కలెక్టరేట్, ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దాదాపు 200 మంది రైతులు పాల్గొన్న ఈ ఆందోళనను పోలీసులు జోక్యం చేసుకుని విరమింపజేశారు.

జనగామ జిల్లా దేవరుప్పులలో జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

## రైతులకు క్షమాపణలు చెప్తున్నా

- సాగునీరందించడంలో జాప్యానికి బాధ్యత వహిస్తున్నా
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ప్రకటన

దేవరుప్పుల, మార్చి 12: రైతులకు సాగునీరందించడంలో జరిగిన జాప్యానికి క్షమాపణలు చెప్తున్నానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ప్రకటించారు. 'రైతులకు సాగునీరివ్వాల్సిన బాధ్యత మాది. కనుక నేను బాధ్యత వహిస్తా. అధికారుల తప్పు కాకున్నా వాళ్లందరి రెస్పాన్స్‌బిలిటీ నాదే. రైతుల పక్షాన నేనుండాలి. రేపటిలోపు కచ్చితంగా నీళ్లొస్తయ్. రైతన్నలకు అండగా ఉంటా' అని తెలిపారు. రైతుల ఆందోళన నేపథ్యంలో మంగళవారం ఆమె నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండాకు చెందిన రైతులు తమకు సాగునీరు అందించాలని పది రోజుల క్రితం ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి వద్దకు వెళ్లి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని పలువురు రైతులు సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎదుట వాపోయారు. దీంతో ఎర్రబెల్లి నేరుగా దేవాదుల ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తన హయాంలో దేవరుప్పులకు పుష్కలంగా సాగునీరు అందించామని, చెరువులు నింపామని, వాగులు పారిచ్చామని, ఇప్పుడేమైందని ప్రశ్నించారు. రేపటిలోపు నీరివ్వకుంటే సెక్రటేరియట్ ముందు రైతులతో ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. దీంతో అధికారులు నీళ్లు వదిలేందుకు సిద్ధపడ్డారు. మరోవైపు మంగళవారం దేవరుప్పుల, పాలకుర్తి మండల కేంద్రాల్లో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించడంతో సాయంత్రం స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది. ఇదిలా ఉండగా.. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దేవాదుల ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ.. దేవరుప్పుల ప్రాంతానికి సాగునీరు తగ్గించి, యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలానికి ఎక్కువ నీరు విడుదల చేయాలని కోరారని సమాచారం. ఈ విషయంలో రైతులు తన వెంట పడుతున్నారనే వీడియో వైరల్ కావడం చర్చనీయాంశమైంది. బీర్ల ఐలయ్య దేవరుప్పుల మండలానికి నీరు తగ్గించాలనడంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళల భద్రత కోసం 'టీ-సేఫ్'

- ప్రత్యేక యాప్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్
- 100 లేదా 112 నంబర్‌కు కాల్ చేస్తే నిమిషాల్లో పోలీస్ వాహనాలు ప్రత్యక్షం
- ఆపదలో ఉంటే అత్యవసర సేవలు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళల భద్రత కోసం, ముఖ్యంగా ఒంటరిగా ప్రయాణించే మహిళల కోసం తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ ప్రత్యేకంగా రూపొందించిన 'ట్రావెల్ సేఫ్' (టీ-సేఫ్) యాప్ అద్భుతంగా ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మంగళవారం ఆయన సచివాలయంలో టీ-సేఫ్ సేవలను ప్రారంభించి, ఈ యాప్‌ను తెలంగాణ మహిళలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో టీ-సేఫ్ సేవలు ఎంతో ఉపకరిస్తాయని, సురక్షిత ప్రయాణం కోసం మహిళలు, పిల్లలు సహా ఎవరైనా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఎక్కడైనా ఆపద తలెత్తినప్పుడు టీ-సేఫ్ ద్వారా 100 లేదా 112 నంబర్‌కు కాల్‌చేసి 8వ నంబర్‌ను ఎంచుకుంటే నిమిషాల్లో పెట్రోలింగ్, బ్లూకోల్ట్ వాహనాలు అందుబాటులోకి వస్తాయని, ఆపదలో చిక్కుకున్నవారు తమ లైవ్ లొకేషన్‌ను టీ-సేఫ్ యాప్ ద్వారా సన్నిహితులకు పంపొచ్చని వివరించారు. టీ-సేఫ్ సేవల కోసం ప్రత్యేకంగా 791 పెట్రోలింగ్ కార్లు, 1085 బ్లూ కోల్ట్ వాహనాలను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. భవిష్యత్‌లో క్యాబ్ అగ్రిగేటర్లు, ప్రైవేట్ రవాణా వ్యవస్థల్లో కూడా టీ-సేఫ్ సేవలను తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తా, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏడీజీ శిఖాగోయెల్, ఏడీజీలు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలుపాల్గొన్నారు.

## 11వ సారి ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) భేటీ ఉన్న నేపథ్యంలో రేవంత్ ఢిల్లీకి వెళ్తున్నారు. ఆయన సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత గత మూడునెలల్లో ఢిల్లీకి వెళ్లడం ఇది 11వ సారి. గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉన్నవారెవ్వరూ ఇంత స్వల్ప వ్యవధిలో ఇన్ని సార్లు ఢిల్లీ వెళ్లిన చరిత్రలేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఒకటిరెండు సార్లు రేవంత్ ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీ వెళ్లారు. మిగిలిన పర్యటనలన్నీ ప్రధానంగా పార్టీ వ్యవహారాలపై చర్చించేందుకు, నిర్ణయాలు తీసుకునేందుకేనని తెలుస్తున్నది. ఢిల్లీలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సీఈసీ భేటీ జరగనున్నది. దీనికి రేవంత్‌తోపాటు మంత్రి ఉత్తమ్ కూడా హాజరవుతున్నారు.

## కోటిమందిని కోటీశ్వరులను చేస్తాం

- శిల్పారామం వద్ద మహిళలకు 100 దుకాణాలు
- కాంగ్రెస్ పార్టీ అంటే ఇందిరా, సోనియా, ప్రియాంకగాంధీ..
- మహిళ నాయకత్వంలో పనిచేయడానికి గర్విస్తున్నాం
- మహిళా సదస్సులో సీఎం రేవంత్

మహిళా శక్తి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): వచ్చే ఐదేండ్లలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల్లో 63 లక్షల మంది మహిళలున్నారని, ఆ సంఖ్యను కోటికి పెంచి వారందరిని కోటీశ్వరులను చేస్తామని అన్నారు. హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా సదస్సులో సీఎం ప్రసంగించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తే రాష్ట్రం బంగారు తెలంగాణ, ధనిక తెలంగాణ, అభివృద్ధి తెలంగాణ అవుతుందని చెప్పారు. మహిళా పొదుపు సంఘాల ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామం వద్ద నెల రోజుల్లో వంద దుకాణాలు కట్టిస్తామని ప్రకటించారు. అక్కడ మహిళా సంఘాల ఉత్పత్తులు టాటా, బిర్లా, అదానీ, అంబానీల ఉత్పత్తులతో పోటీపడేలా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం జరుపుకొనే అవకాశం కలుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ అని, తాము ఓ మహిళ నాయకత్వంలో పనిచేయడానికి గర్విస్తున్నామని

> కాంగ్రెస్ పార్టీ అంటే ఇందిరాగాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకగాంధీ. ఓ మహిళ నాయకత్వంలో పనిచేయడానికి గర్విస్తున్నాం.
>
> -సీఎం రేవంత్‌రెడ్డి

చెప్పారు. నిరుడు సెప్టెంబరు 17న సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పించామని తెలిపారు. మహిళలను కట్టెల పొయ్యి కష్టాలను గట్టెక్కించేందుకు గతంలో దీపం పథకం ద్వారా సోనియాగాంధీ 400కే గ్యాస్ సిలిండర్ ఇస్తే, ప్రధాని నరేంద్ర మోదీ దానిని 1200కు పెంచి మళ్లీ కట్టెల పొయ్యికి మళ్లే పరిస్థితి కల్పించారని దుయ్యబట్టారు. సోనియాగాంధీ ఇచ్చిన హామీ మేరకు 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచామని తెలిపారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో 22,500 కోట్లతో నాలుగున్నర లక్షల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పా రు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు.

### మహిళల ఆశీర్వాదంతోనే ప్రభుత్వం

రాష్ట్రంలో ఆడ బిడ్డల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రస్తుతం లక్ష మందితో సదస్సు పెట్టామని, రానున్న రోజుల్లో పది లక్షల మంది మహిళలతో హైదరాబాద్‌లో కవాతు నిర్వహిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామనే వారికి గుణపాఠం చెప్తామని అన్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్‌షా మరోసారి మోదీని ప్రధాన మంత్రిని చేయాలంటున్నారని, పదేండ్లుగా ప్రధానిగా మోదీ ఏం చేశారని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర అడిగిన రైతులపై తుపాకీ తూటాలు పేల్చారని, ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని ఒక్కరికి కూడా ఇవ్వలేదని విమర్శించారు. స్విస్ బ్యాంకుల నుంచి నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని నయాపైసా వేయలేదని మండిపడ్డారు. నరేంద్రమోదీతో కేసీఆర్ చీకటి ఒప్పందాలు చేసుకున్నారని, అందుకే బీజేపీ ప్రకటించిన 9 సీట్లలో కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించలేదని, కేసీఆర్ ప్రకటించిన నాలుగు సీట్లలో బీజేపీ అభ్యర్థులను ప్రకటించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లలో గెలిపించాలని కోరారు.

## కేసీఆర్‌తోనే బుక్కెడు బువ్వ

- ఎండిన పొలం మేకల పాలైంది..
- చేను కాడికి వస్తే కుషాల్ లేదు
- కొడుకు సచ్చిపాయె.. చిన్న కూనలని సాదేదెట్లా?
- ముషంపల్లి రైతు మల్లయ్య ఆవేదన
- సోషల్‌మీడియాలో వీడియోవైరల్
- త్వరలో వచ్చి కలుస్తానన్న కేటీఆర్

నల్లగొండ, మార్చి 12 : 'కేసీఆర్ గెలిస్తేనే మాకు బుక్కెడు బువ్వ. ఈ సారి కేసీఆర్ సా రు లేక బత్తాయి తోట, పొలం ఎండిపోయింది. ఎండిన పొలం మేకల పాలైంది. బువ్వకాడికి పోతే సంతోషం లేదు. చేను కాడికి వస్తే కుషాల్ లేదు. చేసిన అప్పు తీర్చేదెట్ల? సచ్చిపోయిన కొడుకుకు ఉన్న చిన్న చిన్న కూనలను సాదేదెట్ల? కడుపు గుద్దుకుంటున్న. పురుగుల మందు తాగాలనిపిస్తుంది. లేదంట కంపల్ల ప డి సచ్చిపోవాలనిపిస్తుంది' ఇదీ నల్లగొండ మండలం ముషంపల్లికి చెంది న రైతు గన్నెబోయిన మల్లయ్య ఆవేదన. 9 ఎకరాలు ఉన్న మల్లయ్యకు ఇప్పటికీ రైతుబంధు రాలేదు. పంట ఎండి పెట్టుబడి మీదపడటంతో ఓ వీడియోలో వ్యక్తం చేసిన తన ఆవేదన వైరల్ అయింది. ఇందుకు స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'మల్లయ్య మాటలు మనసుకు తగిలాయని, త్వరలోనే ముషంపల్లికి వచ్చి మల్లయ్యతో పాటు బోర్ల రాంరెడ్డిని కలుస్తానని' ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

## హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, మార్చి 12(నమస్తే తెలంగాణ): దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ వరి సదస్సును జూన్ 4-6 వరకు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఫిలిప్పైన్స్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో 28 దేశాల నుంచి దాదాపు 500 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యాపారులు, అనుబంధ రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో వరి రకాల ప్రదర్శనతో పాటు రాష్ట్రానికి సంబంధించి వివిధ ఉత్పత్తుల లభ్యతపై వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇదిలా ఉంటే రైతువేదికల్లో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ సేవల్ని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డితో కలిసి మంత్రి తుమ్మల మంగళవారం ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు, కార్పొరేషన్లకు వస్త్రాలు, యూనిఫాంలు తప్పనిసరిగా టీఎస్‌సీవో ద్వారానే కొనుగోలు చేయాలని జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. తయారైన వస్త్రాలను టెస్కో ద్వారా సేకరిస్తున్నట్లు చెప్పారు.

### ఆదుకోకుంటే ఆత్మహత్యనే..

'వాగు, కాల్వల ద్వారా నీళ్లు వస్తాయని, భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేసిన. కానీ నీరు రాకపాయె. బోరు ఎండిపాయె. నీరం దక పంటలు ఎండిపాయె.. బతుకు ఆగమా యె.. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శర ణ్యం' అని ఓ రైతు పురుగుల మందు డబ్బా పట్టుకొని ఆవేదన వ్యక్తంచేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా కందూరు రైతు పిల్లి రాంచంద్రయ్య మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేయ గా, నీళ్లు అందక వరి మడులన్నీ నెర్రెలు బారడం తో ఆందోళన చెందుతున్నాడు. - మూసాపేట (అడ్డాకుల)

## ..రాష్ట్రాన్ని శాసిస్తున్నా

మొదటిపేజీ తరువాయి...

కాదని, ఇతరుల ఆత్మగౌరవాన్ని కించపరిచేవాడిని కూడా కాదని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లో మంగళవారం నిర్వహించిన సింగరేణి అతిథి గృహ శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదాద్రిలో చిన్నపీట సంఘటనతో చెలరేగిన దుమారంపై తనకు మద్దతుగా నిలిచిన వారందరికి భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. తాను కింద కూర్చున్న ఫొటోను చూసి చాలా మంది మనసు కష్టపడి ఉండొచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహుడికి మొక్కులు చెల్లించడం కోసం కావాలనే తాను చిన్నపీటపై కూర్చొని ఆశీస్సులు తీసుకున్నానని తెలిపారు. తననూ ఎవ్వరూ అవమానించలేదని చెప్పారు. ప్రతి ఒక్కరూ సహృదయంతో యాదాద్రి సంఘటనను అర్థం చేసుకోవాలని కోరారు.

### సింగరేణి పరిరక్షణ అందరి బాధ్యత

తెలంగాణకు ఎంతో గర్వకారణమైన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీనగర్‌లో నిర్మించనున్న సింగరేణి అతిథి గృహానికి శంకుస్థాపన చేశారు. ఈయేడు సింగరేణిలో 1900 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఇందులో గత వారంలో 489 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, మరో 1352 ఉద్యోగాల భర్తీకి అతిత్వరలో నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించారు. 134 ఏండ్ల చరిత్రలో సింగరేణికి హైదరాబాద్‌లో గెస్ట్ హౌస్ లేకపోవడం బాధాకరమని, కార్మికులు, అధికారుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు.

## మహాలక్ష్మి పథకంతో లాభాల్లో ఆర్టీసీ

- పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- 22 నాన్‌ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకంతో మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడంవల్ల టీఎస్ఆర్టీసీ లాభాల్లోకి వెళ్లిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవడం వల్ల.. ఆర్టీసీ బస్సులన్నీ నిండుగా వెళ్తున్నాయని చెప్పారు. మహిళల టికెట్ డబ్బును ఆర్టీసీకి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నదని తెలిపారు. తెలంగాణకు తలమానికమైన ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి ఉన్నదని చెప్పారు. ఆర్టీసీ సిబ్బంది పడుతున్న కష్టాన్ని, శ్రమను గుర్తించి వారికి 21శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించామని గుర్తుచేశారు. హైదరాబాద్ ఎన్టీఆర్‌మార్గ్‌లోని డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారంతెలంగాణ ఆర్టీసీకి చెందిన గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్కతోపాటు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. పర్యావరణహితమైన 22 ఎలక్ట్రిక్ బస్సులను వారు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రులు ఆ బస్సుల్లో సచివాలయానికి వెళ్లారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల టీఎస్ ఆర్టీసీ కళకళలాడుతున్నదని, ప్రతి బస్సు 100 శాతం ఆక్యుపెన్సీతో తిరుగుతున్నదని, మహాలక్ష్మి పథకాన్ని ఈ బస్సుల్లో కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నిర్వాహకులపై చర్య తీసుకోవాలి: సీపీఎం

యాదాద్రి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పట్ల ఆలయ నిర్వాహకులు కులవివక్ష ప్రదర్శించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఘటనపై విచారణ జరిపించాలని, చిన్నపీటలు వేసి కుల వివక్షకు బాధ్యులైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

### భట్టి వివాదంపై గుట్ట ఈవోకు నోటీసులు?

యాదాద్రి భువనగిరి, మార్చి 12 (నమస్తే తెలంగాణ): యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల పర్యటన సందర్భంగా నెలకొన్న కుర్చీ వివాదంపై దేవాదాయ శాఖ ఆరా తీసింది. ప్రధానాలయంలో జరిగిన ఘటనపై వివరణ ఇవ్వాలని యాదగిరిగుట్ట ఆలయ ఈవో రామకృష్ణారావును కోరినట్టు తెలిసింది. ఈ మేరకు ఆయనకు సోమవారం రాత్రే నోటీసులు జారీ అయినట్టు సమాచారం.



## ఆటో డ్రైవర్ వినూత్న నిరసన

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 12 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఓ ఆటోడ్రైవర్ ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో ఆటో టికెట్ ఆఫర్ పట్టికను ఆటో అద్దానికి అతికించాడు. దీంతో తోటి ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. అసలే కిరాయిలు లేవు, ఇలాంటి ఆఫర్ (తక్కువ చార్జీలు) పెడితే ఉన్న కిరాయిలు కూడా పోతాయని అతన్ని బుజ్జగించి ఆ ధరల పట్టికను తీయించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన వేణుగోపాల్ గిరాకీ లేకపోవడంతో తన ఆవేదనను ఇలా వెలిబుచ్చాడు.

## కొత్తగా 16 కార్పొరేషన్లు

మొదటిపేజీ తరువాయి...

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే కార్పొరేషన్లలో ముదిరాజ్, యాదవకురుమ, మున్నూరుకాపు, పద్మశాలి, పెరిక(పురగిరి క్షత్రియ), లింగాయత్, మేరు, గంగపుత్ర కార్పొరేషన్లతో పాటు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు, ఆర్యవైశ్య, రెడ్డి, మాదిగ, మాదిగ ఉపకులాలు, మాల, మాల ఉప కులాలు, మూడు ప్రత్యేక కార్పొరేషన్లు.. కుమ్రంభీం ఆదివాసీ, సంత్ సేవాలాల్ లంబాడీ, ఏకలవ్య (ఎరుకల) కార్పొరేషన్లు ఏర్పాటు చేయబోతున్నట్టు వివరించారు.

### కాళేశ్వరం.. విద్యుత్ కొనుగోళ్లపై విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు, అవినీతిపై విచారణకు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పినాకిని చంద్రఘోష్, కొత్తగూడెం, భద్రాద్రి విద్యుత్తు కేంద్రాల ఏర్పాటు, చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోళ్లలో అవకతవకలు, అవినీతిపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో వేర్వేరుగా రెండు విచారణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ రెండూ వంద రోజుల్లో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. ఆరు గ్యారెంటీలలో కొన్ని అమలు చేశామని, మిగతా వాటికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని మంత్రులు వివరించారు.

### తెల్ల రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

అర్హులైన అందరికీ తెల రేషన్‌కార్డులు జారీ చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మొదటి దశలో ఇంటిస్థలం ఉండి, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారిని మాత్రమే లబ్ధిదారులుగా పరిగణిస్తారు. ఒక్కో నియోజకవర్గానికి 3,600 చొప్పున ఇండ్లకు 22,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపికచేస్తారు.

### 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు

2008 డీఎస్సీ ఉపాధ్యాయ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవాలని క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టైం స్కేల్ ప్రకారం తక్షణమే వారిని నియమించాలని నిర్ణయించింది. ఇప్పటికే 84 శాతం మంది రైతులకు రైతుబంధు ఇచ్చామని, మరో రెండు రోజుల్లో 93 శాతంమంది రైతులకు రైతుబంధు నగదు జమచేయాలని నిర్ణయించినట్టు మంత్రులు వెల్లడించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారయ్యే ఉత్పత్తుల బ్రాడింగ్, మార్కెటింగ్ కోసం ఓఆర్‌ఆర్ చుట్టూ 30 ఎకరాలు కేటాయించాలని మంత్రి మండలి నిర్ణయించింది. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ను ఆదేశించినట్టు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డుల జారీకి అర్హుల ఎంపికకు నిబంధనలను రూపొందించాలని ఆదేశించినట్టు వివరించారు.

### ఎమ్మెల్సీలుగా కోదండరాం, అలీఖాన్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఉర్దూ జర్నలిస్ట్ ఆమిర్‌అలీఖాన్ పేర్లను తిరిగి గవర్నర్‌కు సిఫారసు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది.

### వేం నరేందర్‌రెడ్డిని కలిసిన గుత్తా అమిత్‌రెడ్డి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి మంగళవారం ఉదయం ప్రభుత్వం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలవడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. అమిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నట్టు ఇటీవల ప్రచారం జరగ్గా, అలాంటిదేమీ లేదని ఖండించారు. ఈ నేపథ్యంలో ఆయన వేం నరేందర్‌రెడ్డిని కలవడంతో పార్టీ మార్పు ప్రచారానికి మరింత బలం చేకూర్చినట్టు అయింది.

### ధరణిపై సిట్!

మంత్రిమండలిలో ఎక్కువ సేపు ధరణిపైనే చర్చ జరిగినట్టు తెలిసింది. ధరణి వెబ్‌సైట్ ద్వారా జరిగిన అవకతవకలపై అంతర్గత విచారణకు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయాలని మంత్రిమండలి నిర్ణయించినట్టు తెలిసింది. భూములకు పట్టాలు పొందిన వాటిపై అధ్యయనం చేయనున్నారు.

### సీజేగా జస్టిస్ నరసింహారెడ్డికి అనుభవం

గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లు, ఒప్పందాలపై విచారణకు ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిది ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గవిచర్ల. జనవరి 2015 నుంచి అదే ఏడాది జూలై 31 వరకు పాట్నా హైకోర్టు సీజేగా పనిచేశారు.

### తొలి లోక్‌పాల్ జస్టిస్ పినాకిని చంద్రఘోష్

మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు అంశంపై న్యాయవిచారణ కోసం ప్రభుత్వం నియమించిన జస్టిస్ పినాకిని చంద్రఘోష్ 1952లో కలకత్తాలో జన్మించారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడిగా, బెంగాల్, అండమాన్ అండ్ నికోబారా స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పనిచేశారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గానూ పనిచేశారు. నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ సర్వీసెస్ అండ్ రీసెర్చ్‌కు కులపతిగా వ్యవహరించారు. 2019లో దేశ తొలి లోక్‌పాల్‌గా జస్టిస్ పినాకిని చంద్రఘోష్ నియమితులయ్యారు.

## ప్రజాస్వామ్య ఆనవాళ్లతో రాష్ట్ర చిహ్నం

ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను ప్రతిబింబించడంతోపాటు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు కనబడేలా రాష్ట్ర చిహ్నం ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర చిహ్నం, విగ్రహం, గీతం ఖరారు కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సామాన్య మహిళను గౌరవించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని సూచించారు. ప్రముఖ కవి అందెశ్రీతో రాష్ట్ర గీతంపై చర్చించి సమకాలీన కాలానికి అనుగుణంగా జయజయ హే పాటకు కొన్ని మార్పులు చేర్పులు చేయాలని తెలిపారు. ప్రముఖ కళాకారులు, మేధావులతో రాష్ట్ర చిహ్నం, విగ్రహానికి సంబంధించిన డిజైన్‌లను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతం, రాష్ట్ర విగ్రహంలో రాష్ట్రానికి సంబంధించిన అంశాలు ఉండాలని పేర్కొన్నారు.